ప్రతి అక్షరం ప్రజాహితం

Title code: AP TEL16425.

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

ఎడిటర్: సి యం శ్రీనివాస్, పబ్లిషర్ : అనంతపురం మంగళవారం 14-5-2024 సంపుటి :1 సంచిక :255 పేజీలు : 4 వెల : 5-00

## నరసరావుపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు

- చదలవాడ అరవింద్ బాబు కారుపై దాడి

-దాడులపై ఇసికి బిజెపి నేతల ఫిర్యాదు




2లో

## ఈ పోలింగ్ చారిత్రాత్మకం

- ప్రజల్లో ఓటు చైతన్యం పెరిగింది

-చంద్రబాబు ఆసక్తికర ట్వీట్



వివరాలు 2లో

## ప్రధాని మోడీ మతపర ప్రసంగాలు

- ప్రధాని మోడీ మతపర ప్రసంగాలు
- చర్యలకు ఇసిని ఆదేశించాలంటూ పిటిషన్
- మెరిట్ లేదంటూ తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు





వివరాలు 2లో

# పోలీసులకే రక్షణ లేకుండా పోయింది

## తాడిపత్రిలో ఎస్పీ వాహనంపైనే దాడి అమానుషం

## హింసాత్మక ఘటనలపై చంద్రబాబు ఆగ్రహం



అమరావతి,మే13 ఆంధ్రప్రగతి

ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వేళ పలుచోట్ల వైకాపా శ్రేణులు రెచ్చిపోవడంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. నేటి పోలింగ్‌లో వైకాపా హింస ఎంతవరకు వెళ్లిందంటే.. కనీసం పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనం పైనే దాడి చేయడం.. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి అస్మిత్ రెడ్డిపై దాడికి దిగడం, వైసీపీ హింసా రాజకీయాలకు పరాకాష్ఠ. జగన్ ఐదేళ్లుగా పెంచి పోషించిన రౌడీ మూకలు.. ఈరోజు తమ దాడుల ద్వారా ప్రజల్లో భయం పుట్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించడం ద్వారా లబ్ది పొందే కుట్ర చేస్తున్నారు. ప్రజలారా... ఈ కుట్రను మీరే తిప్పికొట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ నిర్భయంగా తరలివచ్చి ఓటు వేయాలి. అత్యధిక ఓటు శాతంతో హింసా రాజకీయానికి ముగింపు పలకాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇకపోతే రాష్ట్రంలో ఓటరు చైతన్యం వెల్లివిరిసిందని, ఉదయం 7గంటల నుంచే పెద్ద సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చి ఓట్లు వేసిన వారికి తెదేపా అధినేత చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పుడు సాయంత్రం 5 గంటలైంది.. ఉదయం 7 గంటలకు ఎంత పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారో.. పోలింగ్ ముగిసే ఈ సమయంలో కూడా అంతే ఉత్సాహంగా ఓట్లు వేస్తున్నారు. ప్రజలు ఓటింగ్‌పై ఇంత ఉత్సాహం చూపడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామం. ఆ వర్గం ఈ వర్గం అని తేడా లేకుండా అందరూ వచ్చి ఓటేస్తున్నారు.

- మిగతా 2లో పేజిలో













# ఓటు వేసిన వైసీపీ, టిడిపి కాంగ్రెస్ నాయకులు

- ఓటేసిన చంద్రబాబు. బాలకృష్ణ

-పులివెందులో జగన్ దంపతుల ఓటు

-హిందూపురంలో ఓటేసిన బాలకృష్ణ దంపతులు

-ఇడుపులపాయలో షర్మిల దంపతుల ఓటు

**అమరావతి,మే13ఆంధ్రప్రగతి**

ఎపిలో పలువురు ప్రముఖులు ఉదయమే ఓటు వేశారు. అమరావతిలో చంద్రబాబు సతీమసమేతంగా ఓటేశారు. అలాగే పులివెందులలో జగన్ దంపతులు ఓటేశారు. ఇడుపులపాయలో షర్మిల ఓటేశారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు కూడా ఓటేశారు. పవన్ కళ్యాణ్ మంగళగిరిలో ఓటేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి వసుంధరతో కలిసి ఆయన ఓటు వేశారు. హిందూపురంలోని ఓ పోలింగ్ కేంద్రంలో వారు తమ ఓటును వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం బయట బాలకృష్ణ దంపతులు తమ వేళ్లకు ఉన్న సిరా గుర్తులను చూపించారు. నటుడు బాలకృష్ణ ప్రస్తుతం హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా

- మిగతా 2లో పేజిలో

# జగన్‌కు అనుకూలంగా ఫలితాలు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,మే13ఆంధ్రప్రగతి**

పోలింగ్ స్టేషన్ల దగ్గర కరెంటు కోతలు లేకుండా ముగ్గురేసి అధికారులను పెట్టి ప్రభుత్వం చాలా కష్టపడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జనరేటర్లను కూడా అందుబాటులో ఉంచారన్నారు. ఐదేండ్లకోసారి జరిగే ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు.

దయచేసి అందరూ బయటికి వచ్చి పోలింగ్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ నంది నగర్ లోని జిహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న కేటీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియో గించ కున్నారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనకు సోదరుడి లాంటి వారని, ఈ ఎన్నికల్లో ఆయన మంచి ఫలితాలు సాధి స్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఆరు గ్యారంటీలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఒక

- మిగతా 2లో పేజిలో



# ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

వివరాలు 2లో

ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు
తెనాలి, మాచర్ల, అనంతపురం ఘటనలపై ఇసి సీరియస్

తెనాలి వైకాపా అభ్యర్థి గృహనిర్బంధానికి ఆదేశం

పుంగనూరు ఎస్ఐ సస్పెన్షన్‌కు ఆదేశం

వైకాపా తీరుపై టిడిపి ఆగ్రహం ..ఇసికి ఫిర్యాదు

120 ఘటనలు జరిగాయని కనకమేడల వెల్లడి



# పెనమలూరు నియోజకవర్గంలో వైకాపా నేతల బీభత్సం

విజయవాడ,మే13 పోలింగ్ వేళ కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలో వైకాపా నేతలు బీభత్సం సృష్టించారు. పెనమలూరు మండలం నిడమానూరు హైస్కూల్ వద్ద పోలింగ్ కేంద్రంలో తెదేపా వర్గానికి చెందిన వీర్ల రాజేష్, షరీఫ్‌పై వైకాపా అభ్యర్థి జోగి రమేశ్ తన అనుచరులతో వచ్చి దాడి చేశారు. అనంతరం తెదేపా వర్గీయుల ఇళ్ల ముందు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మరో వైపు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు జోగి రమేశ్ భారీగా తన అనుచరులను తరలించి దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. తెదేపా శ్రేణులు ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం వరకు ఘర్షణలు జరగుతూనే ఉన్నాయి. నిడమానూరు పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా దాడిలో గాయపడిన వారిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్ పరామర్శించారు. వరుసగా రెండో సారి అందుకునేందుకు పోలింగ్ వేళ.. అధికార వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. ఆ క్రమంలో అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకొంటున్నాయి. అయితే రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్.. తన అనుచరగణంతో పెనమలూరు నియోజకవర్గం ఉప్పులూరులోని పోలింగ్ కేంద్రానికి తరలి వచ్చారు. ఆయనతో పాటు పార్టీకి చెందిన వందలాది మంది కార్యకర్తలు భారీగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న స్థానిక టీడీపీ శ్రేణులు సైతం పోలింగ్ జరుగుతున్న ఉప్పులూరు ప్రాథమిక పాఠశాల వద్ద భారీగా చేరుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి... ఇరు వర్గాలను చెదరగొట్టేందుకు లాఠీలు ఝుళిపించారు. పెనమలూరు అసెంబ్లీ స్థానం నుంచి జోగి రమేష్ వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో జోగి రమేష్.. పెడన నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం సీఎం వైయస్ జగన్ తన రెండోసారి చేసిన కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా జోగి రమేష్‌కు గృహ నిర్మాణ శాఖకు కేటాయించారు. అయితే జోగి రమేష్ స్వగ్రామం మైలవరం నియోజకవర్గంలో ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి జోగి రమేష్.. మైలవరం కేంద్రంగా రాజకీయం చేయడం ప్రారంభించారు. ఆ క్రమంలో నాటి వైసీపీ నాయకుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు పెడన ఎమ్మెల్యే జోగి రమేష్ మధ్య అధిపత్య పోరు గట్టిగానే నడించింది. అయితే ఎన్నికల ముందు వసంత కృష్ణ ప్రసాద్ టీడీపీలో చేరారు. మరోవైపు గత ఎన్నికల్లో పెనమలూరు నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల ముందు ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం టీడీపీలో చేరారు.

# ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

అమరావతి,మే13 ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు హింసాత్మకంగా మారాయి. పలుచోట్ల వైకాపా శ్రేణులు దాడు లుకు దిగాయి. గుంటూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దాడులకు పాల్పడిన వారిపై గృహనిర్బంధంతో పాటు కేసులు పెట్టాలని ఈసీ ఆదేశించింది. పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని ఆదేశించింది. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎలాంటి ఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను మాజీ ఎంపీ కనక మేడల రవీంద్ర కుమార్ ఈసీకి అందజేశారు. ఉదయం నుంచి రాష్ట్రంలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెనాలి వైకాపా అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌పై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు శివకుమార్‌ను గృహనిర్బంధంలోనే ఉంచాలని పేర్కొంది. పోలింగ్ కేంద్రంలో శివకుమార్ క్యూలైన్‌లో వెళ్లకుండా నేరుగా వెళ్లడంపై ఓటరు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన శివకుమార్.. ఓటరు చెంపపై కొట్టారు. వెంటనే ప్రతిఘటించిన ఓటరు.. వైకాపా అభ్యర్థి చెంప చెళ్లుమనిపించారు. అనంతరం శివకుమార్ అనుచరులు ఓటరుపై విచక్షణారహితంగా దాడికి దిగారు. ఈ ఘటన ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇసికి టిడిపి ఫిర్యదు చేసింది.

ఉదయం నుంచి ఏపీలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని తెదేపా మాజీ ఎంపీ కనక మేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ వేళ శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను కనకమేడల ఈసీకి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని చోట్లా వైకాపా నేతలు హింసకు పాల్పడుతున్నారు. తెదేపా కార్యకర్తలు, ఏజెంట్లు, నేతలపై దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు సహకరిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైకాపా అభ్యర్థులు, నేతలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

# జగన్‌కు అనుకూలంగా ఫలితాలు

(మొదటి పేజి (తరువాయి)

గ్యారెంటీని సగం సగం అమలు చేసిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తాను ముఖ్యమంత్రిని గుర్తించాలని అన్నారు. కరెంటు కోతలు, నీటి కొరతల వంటి అసలైన సమస్యల పైన రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు ఎవరికి ఓటేస్తారో నాలుగో తేదీన తేలుతుందని అన్నారు. పదేండ్ల నుంచి నరేంద్ర మోడీ ప్రజలని మోసం చేస్తుంటే.. వందరోజుల నుంచి ఇక్కడ రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ కోసం తెలంగాణ భవిష్యత్తు కోసం తాను ఓటేశానని, అందరూ ఓటేయాలని కోరారు.

# పోలీసులకే రక్షణ లేకుండా పోయింది

(మొదటి పేజి (తరువాయి)

అన్ని ప్రాంతాల్లో అదే జోరు కనిపిస్తోంది. మాచర్ల, నరసరావుపేట వంటి చోట్ల ఓటమి భయంతో వైకాపా హింసకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనంపైనే వైకాపా గూండాలు దాడి చేశారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవ రాయ లు, అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు వాహనాలపై దాడికి పాల్పడ్డారు. మరోవైపు తెనాలిలో వైకాపా ఎమ్మెల్యే ఓటరుపై చేయి చేసుకున్నారు. ఈ స్థాయిలో హింస జరిగినా ప్రజలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇంకా పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు. ఈ చైతన్యం, ఈ సంకల్పం చూస్తుంటే.. ఈ రోజు రాత్రి వరకు కూడా పోలింగ్ జరిగే అవకాశం కనిపిస్తోందని అన్నారు. కచ్చితంగా ఓటు వేయాలనే ప్రజల ఈ సంకల్పం రాష్ట్రానికి మేలు చేస్తుంది. గత ఎన్నికల్లో 80 శాతం ఓటింగ్ జరిగింది. ఇప్పుడున్న జోరు చూస్తే 85 శాతంపైగా పోలింగ్ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామాన్ని కూటమి స్వాగతిస్తోంది. సాయంత్రం 6 గంటలలోపు క్యూ లైన్‌లో ఉండే ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం ఉంటుంది. దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు తమ తీర్పును ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా. నేటి మీ ఓటు.. రేపటి మీ భవితకు బంగారు బాట అవుతుంది. స్వేచ్ఛ, స్వాతంత్యం÷-ర.. కనీస హక్కులతో కూడిన గౌరవప్రదమైన జీవితాన్ని మీకు అందించేది ప్రజాస్వామ్యం. ఆ ప్రజాస్వామ్యాన్ని మీ ఓటుతో కాపాడండని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# ఓటు వేసిన వైసీపీ, టిడిపి కాంగ్రెస్ నాయకులు

(మొదటి పేజి (తరువాయి)

ఆయన మరోసారి అక్కడి నుంచే బరిలో నిలిచారు. ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దంపతులు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిల, భర్త అనిల్‌తో కలిసి ఇడుపుల పాయ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలి ంగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రైల్వేకోడూరు లో వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. అందరూ ఓటు హక్కును వినియో గించుకోవాలని కోరారు. అధికారులు,

పోలీసులు నిస్వార్థంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత ఉందని కోరారు. బిజెపి అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఓటేశారు.

# ఘర్షణలపై ఈసీ సీరియస్

అమరావతి: గుంటూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దాడులకు పాల్పడిన వారిపై గృహనిర్బంధంతో పాటు కేసులు పెట్టాలని ఈసీ ఆదేశించింది.పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని ఆదేశించింది. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎలాంటి ఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించిం ది.ఏపీలో శాంతిభద్రతలు విఫలం: ఈసీకి టిడిపి ఫిర్యాదుఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఉదయం నుంచి ఏపీలో 120కి పైగా హింసాత్మక ఘటనల ం చోటు చేసుకున్నాయని టిడిపి మాజీ ఎంపీ కనక మేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ వేళ శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ఈమేరకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను కనకమేడల ఈసీకి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "అన్ని చోట్లా వైకాపా నేతలు హింసకు పాల్పడుతున్నారు.

తెదేపా కార్యక ర్తలు, ఏజెంట్లు, నేతలపై దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు సహకరి స్తున్నారు. ఎన్ని కల కోడ్ ఉల్లంఘించిన వైకాపా అభ్యర్థులు, నేతలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

# నరసరావుపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు

నరసరావుపేట,మే13 పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా వర్గీయులు హల్‌చల్ చేశారు. పలువురు ఓటర్లపై దాడికి పాల్పడటంతోపాటు తెదేపా అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబు కారుపై దాడి చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. అక్కడితో ఊరుకొని వైకాపా మూకలు అక్కడినుంచి వెళ్లిపోయి స్థానిక తెదేపా కార్యాలయంపై దాడికి ప్రయత్నించారు. ఆ దాడిని తెదేపా శ్రేణులు తిప్పికొట్టాయి. అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ఆందోళన చేపట్టాయి. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. రబ్బర్ బు÷-లలెట్స్, టియర్ గ్యాస్ ప్రయోగించి ఇరు వర్గాలను చెదరగొట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైకాపా దారుణాలపై ఎన్నికల సంఘానికి భాజపా ఫిర్యాదు చేసింది.

వైకాపా చర్యలతో చాలామంది ఓటర్లు ఓటు వేయకుం డానే ఇళ్లకు వెళ్లాల్సివస్తోందని ఫిర్యాదులో పేర్కొంది. అధికార వైకాపా తమ గూండాలతో అరాచకాలు, గూండా యిజం చేయించి ప్రజాస్వామ్యాన్ని హస్తగతం చేసుకునేందుకు కుట్రలు పన్నుతోందని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ప్రజలు పెద్దఎత్తున ఓటు వేయడానికి వస్తున్నారని, వైకాపా దౌర్జన్యాల వల్ల ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారని తెలిపింది. కూటమి అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, ప్రజలపై వైకాపా దాడులపై ఆందోళన వ్యక్తంచేసింది. పల్నాడు జిల్లాలో పదికి పైగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసుల సమక్షంలోనే పోలింగ్ కేంద్రాల వద్ద మా ఏజెంట్లు, ఓటర్లపై వైకాపా గూండాలు దాడులు చేశారు. గత రాత్రి మాచర్ల నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు హత్యకు గురయ్యారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో కూటమి కార్యకర్తలపై దాడులు జరిగాయి. ఇన్ని ఘటనలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోట్లేదని ఫిర్యాదులో పేర్కొంది.

# ప్రధాని మోడీ మతపర ప్రసంగాలు

న్యూఢిల్లీ,మే13 లోక్‌సభ ఎన్నికల్లో మతపరమైన విభజన ప్రసంగాలు చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉల్లంఘించారని, ఆయనపై చర్యలకు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని, విచారణకు అర్హమైనది కాదని జస్టిస్ సచిన్ దత్తా తీర్పునిచ్చారు.పిటిషనర్లు చేసిన ఫిర్యాదును చట్టానికి అనుగుణంగా స్వతంత్రంగా అంచనా వేసి చర్య తీసుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు అందని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదనందున తోసిపుచ్చు తున్నట్టు పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్టు ముందుగానే పిటిషనర్ ఒక నిర్ణయానికి రావడం పూర్తిగా అనుచితమని కూడా కోర్టు తెలిపింది. ప్రధాన మంత్రి, ఇతర బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఈనెల 21న ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని వారు ప్రస్తావించారు. షహీన్ అబ్దుల్లా, అమితబ్ పాండే, దేబ్ ముఖర్జీ అనే ముగ్గురు హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. విద్వేష ప్రసంగాలు చేసిన రాజకీయ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదుతో సహా తక్షణ చర్యలు తీసుకునేలా ఈసీఐని ఆదేశించాలని కోర్టును వారు కోరారు.

# ఈ పోలింగ్ చారిత్రాత్మకం



అమరావతి,మే13: ఏపీలో పోలింగ్ ముగిసిన వేళ టీడీపీ అధి నేత చంద్రబాబు నాయుడు ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. ఈ పోలింగ్ రోజుని రాష్ట్రంలో ఓ చారిత్రాత్మక దినంగా అభివర్ణించిన ఆయన.. ఓటు వేసేందుకు ప్రజలు చూపుతున్న ఉత్సాహం స్ఫూర్తిని నింపుతోందని అన్నారు. నిర్దేశిత పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. చాలా ప్రాంతాల్లో ఓటర్లు 6 గంటలకు కూడా క్యూ లైన్‌లో బారులు తీరి ఉన్నారన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాను పరిశీలించి.. వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా.. ఈ ఎన్నికల్లో ఏపీ ఓటర్లు ఎంతో చురుకుగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో గందరగోళ వాతావరణం నెలకొన్నా, అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నా, వర్షాలు పడినా.. లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. సాయంత్రం 5 గంటల వరకు ఏపీలో 67.99 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.13 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా.. 2 కోట్ల 71 లక్షలకు పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1.30 కోట్లకు పైగా పురుషులు ఉండగా, 1.40 కోట్లకు పైగా మహిళలు ఉన్నట్లు తేలింది. పురుషులతో పోలిస్తే.. మహిళలే ఈ పోలింగ్‌లో ఎక్కువగా పాల్గొన్నారు.

# అంతా నిశ్శబ్దం. బోసిపోయిన హైదరాబాద్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిత్యం కిక్కిరిసి పోయో హైదరాబాద్ ఎన్నికల వాతావరణంతో బోసిపోయింది. నిశ్శబ్ద వాతావరంలో ప్రజాజీవనం సాగింది. నిలిచి పోయిన వాహనాలు, ఆగిపోయిన పరిశ్రమల చక్రాలు, అధికారిక బంద్ పాటించిన వ్యాపారవాణిజ్యాలతో భాగ్యనగరం వన్నెతగ్గింది.దీనికి ప్రధానకారణం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు ప్రజలు తరలి వెళ్లడంతో ఈ వాతావరణం ఆవిష్కృతమైంది .రాష్ట్రంలోని హైదరాబాద్ తో పాటు ప్రధాన పట్టణాల్లో రహదారులు బోసిపోయాయి. వాహనాలు హోరు, జోరు కనిపించలేదు. రోడ్లపై వాహనాలు లేకపోవడంతో రహదారులు నిర్మానుష్యంగామారాయి. హైదరాబాద్ లోని ప్రధాన కూడలిల్లో అప్రకటిత కర్ఫ్యూ ప్రకటించినట్లుగా ఉంది. ఉపాధి, ఉద్యోగాలతో హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షలాది మంది తోపాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలసకూలీలు తమఓటు హక్కును వినియోగించుకోవడానికి సొంత గ్రామాలకు వెళ్లడంతో హైదరాబాద్ బోసిపోయింది.హైదరాబాద్ నుంచి గత మూడురోజుల్లో 25 లక్షల మంది ఏపీకి వెళ్లినట్లు నిఘా వర్గాలు అంచనావేశాయి. కేవలం 12వ తేదీన ఒక్కరోజులోనే సుమారు 7లక్షల మంది హైదరాబాద్ నుంచి ఏపీ కి వెటళ్తునట్లు తెలుస్తోంది. అలాగే తెలంగాణ జిల్లాల్లోంచి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఓటు హక్కు సొంత ఊర్లలో ఉండటంతో ఊరి బాటపట్టడంతో బస్తీల్లో జనసందడి తగ్గిపోయింది. వరంగల్, ఖమ్మం, కరీంనగం ్,మంచిర్యాల,నిర్మల్, సిరిసిల్ల నుంచి అత్యధికంగా ఏపీకి తరలివెళ్లినట్లు సమాచారం. ఏపీలో ఉన్న తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తరలి వెళ్లారు.

# లిప్‌స్టిక్‌పై నార్త్ కొరియాలో నిషేధం

## మేకప్‌లపైనా అక్కడ ఆంక్షలు



ప్యోంగ్యాంగ్,మే13 ఉత్తర కొరియాలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఫ్యాషన్ అంశంలో కూడా వాటిని పాటి స్తున్నారు. కాస్మటిక్స్ యూజర్స్‌కు పెనాల్టీ విధిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ పై ఉత్తర కొరియాలో తాజాగా నిషేధం విధించారు. నిజానికి ఎరుపు రంగుకు కమ్యూజినంతో లింకు ఉన్నా.. ఆ రంగు లిప్‌స్టిక్‌ను నార్త్ కొరియా బ్యాన్ చేయడం గమనార్హం. ఎక్కువగా మేకప్ వేసుకున్నవాళ్లను నార్త్ కొరియన్లు పట్టించుకోరు. మేకప్ వేసుకోవడాన్ని పశ్చిమ దేశాల సంస్కృతిగా ఉత్తర కొరియన్లు భావిస్తున్నారు. ఇది ప్రభుత్వ వైఖరికి విరుద్ధమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళలు సాదాసీదాగా ఉండాలన్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకం అన్న విధానాన్ని పాటిస్తున్నారు. అందుకే అక్కడి చట్టాల ప్రకారం.. మహిళలు అతి తక్కువ స్థాయిలో మేకప్ ధరించాల్సి ఉంటుంది.రెడ్ లిప్‌స్టిక్ ఒక్కటే కాదు.. వ్యక్తిగతంగా అందంగా కనిపించాలన్న అంశాలపై ఉత్తర కొరియాలో అనేక ఆంక్షలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిమ్ జాంగ్ ఉన్ సర్కారు అనేక కాస్మటిక్ వస్తువులను బ్యాన్ చేసింది. మహిళలు స్కిన్నీ, బ్లూ జీన్స్ వేసుకోరాదు. బాడీ పియర్సింగ్, హెయిర్‌స్టయిల్స్, ముల్లెట్స్, పొడుగైన కురులు ఉండరాదు. కేవలం సర్కారు అనుమతి ఇచ్చిన హెయిర్‌స్టయిల్స్‌లో మాత్రమే మహిళలు, పురుషులు కనిపించాల్సి ఉంటుంది. కొన్ని సిద్దాంతపరమైన ఆంక్షలు కూడా నార్త్ కొరియాలో ఉన్నాయి. బ్లాక్ ట్రెంచ్ కోట్లను ధరించరాదు. ఎందుకంటే కిమ్ వేసుకున్న స్టయిల్ డ్రెస్సులను మరొకరు వేసుకోరాదు. తనను ఎవరూ కాపీ కొట్టరాదన్న అభిప్రాయాన్ని కిమ్ వ్యక్తం చేశారు. ఫ్యాషన్ విషయంలో ఎవరు ఎలా ఉంటున్నారో పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసులు బృందాలు నిఘా పాటిస్తుంటాయి. ఒకవేళ ప్రజలు ఎవరైనా ఆ ఆంక్షలను ఉల్లంఘిస్తే, వాళ్లు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆడవాళ్లు బ్లూ జీన్స్ వేసుకుంటే వాళ్లకు శిక్ష తప్పదు. కొన్ని సందర్భాల్లో ÷న్ వేస్తారు. కొన్ని సందర్భాల్లో వాళ్ల దుస్తుల్ని చింపేస్తారు. దీని వల్ల వాళ్లు మరోసారి ఆ డ్రెస్సు వేసుకోరన్న అభిప్రాయం ఉన్నది.

# కూటమి నేతల్లో పెరుగుతున్న జోష్..

## పెరుగుతున్న ఓటింగ్ శాతం..




అమరావతి: ఏపీలో పోలింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకు అదే జోరు నడుస్తోంది. వేల సంఖ్యలో ఓటర్లతో పోలింగ్ బూత్‌లు కిటకిటలాడుతున్నాయి.

ఉత్సాహంగా ఓటు వేయడానికి అన్ని వర్గాల ప్రజలు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు ఈ సారి పట్టణ ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున పోలింగ్ జరుగుతోంది. మాచర్ల, పుంగనూరు వంటి చోట్ల దాడులు జరిగినా పోలింగ్‌పై ప్రభావమైతే కనిపించడం లేదు. ఉదయం11 గంటలకే దాదాపు 25% పోలింగ్ నమోదైంది. ఓటింగ్ శాతం భారీగా పెరుగుతుండడంపై కూటమి శ్రేణుల్లో ఉత్సాహం చోటు చేసుకుంటోంది. ఊహించిన దానికంటే ట్రెండ్స్ తమకు పాజిటివ్ గా ఉన్నాయని కూటమి పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కర్నూలు రేంజ్ డీఐజీ.



ఆంధ్రప్రదేశ్ నంద్యాల మే 13:
కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ సిహెచ్ విజయరావు ఎన్నికల ప్రత్యేక పోలీస్ పరిశీలన అధికారి శ్రీ హిమాన్సు శంకర్ త్రివేది నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ రఘువీర్ రెడ్డి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం ఆళ్లగడ్డ టౌన్ నందు గల బాలికల ఉన్నత పాఠశాల, వైపిపీఎం ఉన్నత పాఠశాల మొదలగు సమాసాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను మరియు క్యూలైన్లను పరిశీలించి పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఓటర్లను క్యూ లైన్ లలో పంపించాలని మరియు 100 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా ఉండకుండా చూసుకోవాలని, సెల్ ఫోన్లతో ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరాదని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఎన్నికల అనంతరం ఈవీఎం బాక్సును స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేర్చు వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకొని అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ



ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:
సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ అయిన గోవిందపల్లి, శిరివెళ్ల, ఆళ్లగడ్డ టౌన్ లోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల మొదలగు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగు కేంద్రం వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించి, క్యూ లైన్లలో ఓటర్లను పంపాలని, 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరు ఉండకుండా చూడాలని,ఓటు వేసేందుకు వచ్చిన వారు మినహా ఎవ్వరు ఉండకుండా చూడాలని,200 మీటర్ల దూరంలో వాహనాలు నిలుపుకోవాలని భద్రత సిబ్బందిని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర , ఆర్ముడు రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్లిం మహిళా ఓటర్ల ఐడీలను తనిఖీ చేసిన మాధవీ లత..



హైదరాబాద్: నాలుగో విడత లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత తన నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్ లో ఓటింగ్ సరళని పరిశీలించారు.బూత్‌లో కూర్చున్న ముస్లిం ఓటర్ల బురఖాలను తొలగించమని కోరి ఓటర్ ఐడీల వెరిఫికేషన్ చేశారు. అజాంపూర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 122లో ఈ వెరిఫికేషన్ చేశారు.

**రిక్వెస్ట్‌తోనే వెరిఫికేషన్..**

కాగా, ఐడెంటిటీ వెరిఫికేషన్ కోసం బురఖాలు తొలగించాలని మహిళలను కోరానని, అందులో తప్పేమీ లేదని మాధవీ లత వివరణ ఇచ్చారు. “నేను అభ్యర్థిని. చట్టం ప్రకారం ఫేస్‌మాస్కులు లేకుండా ఐడీ కార్డుల వెరిఫికేషన్ చేసే హక్కు అభ్యర్థులకు ఉంటుంది. నేను కూడా మహిళనే, మహిళలంటే నాకెంతో గౌరవం ఉంది. ఐడీ కార్డుల వెరిఫికేషన్ చేయాలనుకుంటున్నట్టు వారిని అభ్యర్థించాను. ఎవరైనా దీనిని ఒక సమస్యగా చూస్తే వారు భయపడుతున్నట్టుగానే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది” అని మాధవీలత తెలిపారు.కాగా, దీనికి ముందు తన నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో తేడాలు ఉన్నట్టు మాధవీ లత ఆరోపించారు. పోలీసు సిబ్బంది డల్‌గా కనిపిస్తున్నారని, చురుకుగా లేరని చెప్పారు. ఎవరినీ తనిఖీలు చేయడం లేదన్నారు. ఇక్కడకు వచ్చిన సీనియర్ సిటిజన్ల పేర్లు ఓటర్ లిస్టులో లేవని చెప్పారు. వీరిలో కొందరు గోషామహల్‌లో ఉంటున్నారనీ, కానీ వాళ్ల పేర్లు రంగారెడ్డి లిస్ట్‌లో ఉన్నాయని చెప్పారు. కాగా, మాధవీలతపై ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ, బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తున్నారు.

# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 13:
జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా చివరి దశకు చేరుకుందని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన చాంబర్లో మీడియా వాయిస్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. చిన్నచిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియంతా ప్రశాంతంగా, సజావుగా సాగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచే ఓటర్లు బార్లు తీరి తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారన్నారు.. రాత్రి 9 గంటల సమయానికి జిల్లాలో 77% శాతానికి పైగా పోలింగ్ నమోదయిందని... ఇంకా నియోజకవర్గాల్లో ఐదారు పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరి ఉన్నారన్నారు. సాయంత్రం 6 గంటలకు సమయంలో క్యూలైన్లో నిలిచి ఉన్న ఓటర్లందరికి స్లిప్పులు పంపిణీ చేసి ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన పిదప నియోజకవర్గాల వారిగా ఓటర్ల నమోదైన వివరాలు వెల్లడిస్తామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో మొత్తం 13,89,396 ఓటర్లకు గాను రాత్రి 9 గంటల సమయానికి 10,80,277 మంది ఓట్లు పోలయయ్యాన్నారు. ఇందులో పురుష ఓటర్లు 5,26,396, మహిళా ఓటర్లు 5,53,746, ఇతరులు 135 వున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకను క్యూలైన్లలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బార్లు తీరి ఉన్న నేపథ్యంలో పూర్తి వివరాలు పోలింగ్ ప్రక్రియ ముగిసిన పిదప వెల్లడిస్తామని కలెక్టర్ తెలిపారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న దామోదర రాజనరసింహా.. ఏమన్నారంటే



సంగారెడ్డి: రాష్ట్ర వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ – జోగిపేట పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కుమార్తె త్రిషతో కలిసి 196వ పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
“తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోంది. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారు. 12 – 14 పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుంది. బీఆర్ఎస్ పాత్రేమి లేదు” అని రాజనర్సింహా పేర్కొన్నారు.

# డాక్టర్‌ను..యాక్టర్‌ను కావాలనుకున్నవే: శ్రీలీల



సినీ తారల్లో ఇదివరకు చాలామంది డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యానని చెప్పేవాళ్లు. నవతరం కథానాయిక శ్రీలీల మాత్రం డాక్టర్, యాక్టర్ ఈ రెండు వృత్తుల్నీ నాకు నేనుగానే ఎంచుకున్నా అంటోంది. మా ఇంటి వాతావరణం ప్రభావమో ఏమో... పాఠశాల రోజుల్లోనే పెద్దయ్యాక వైద్యురాల్ని కావాలని నాకు నేనుగా నిర్ణయం తీసేసుకున్నా. ఆ దిశగానే నా చదువులు సాగాయి. ఇక నటన అంటారా? నాకు చిన్నప్పట్నుంచీ నాట్యంలో ఉన్న ప్రవేశం నన్ను వేదికలెక్కించింది. ఆ ప్రతిభే నటనవైపూ తీసుకొచ్చింది. ఈ రెండు వృత్తుల ప్రయాణం వేర్వేరుగా అనిపించినా... రెండు కూడా ప్రజలతో ముడిపడినవే కదా. అందుకే రెండింటిపైనా నాకు ఒకే రకమైన ప్రేమ ఉంటుందని చెప్పుకొచ్చింది శ్రీలీల. రొమాంటిక్ ప్రేమకథలన్నా, పీరియాడిక్ కథలన్నా అమితమైన ప్రేమ అని, వాటిల్లో నటించే అవకాశం వస్తే అస్సలు వదులుకోనని చెప్పింది శ్రీలీల.

# కమిట్‌మెంట్ ఇచ్చిన తర్వాతే స్టార్ హీరోయిన్ అయ్యా: రష్మిక



దక్షిణ భారతదేశం నుంచి హీరోయిన్ గా ఉంటూ పాన్ ఇండియా హీరోయిన్ గా మారిపోయారు రష్మిక. అంతేకాదు.. నేషనల్ క్రష్ అయ్యారు. రష్మిక మందన్నా ఏదైనా సినిమా ఒప్పుకుందా? అంటే అది కచ్చితంగా హిట్ అవుతుంది అనే పేరు సంపాదించుకుంది. నాగశౌర్య సరసన చలో సినిమా ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన రష్మిక మంచి మంచి కథలను ఎంచుకుంటూ జాతీయస్థాయిలో పేరు సంపాదించుకున్నారు. తన అందం, నటనతో కుర్రకారుకు నిద్ర పట్టకుండా చేస్తున్నారు. ఇటీవలే యానిమల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. ప్రస్తుతం పుష్ప 2, రెయిన్ బో, గర్ల్ ఫ్రెండ్, కుబేర వంటి చిత్రాల్లో నటిస్తోంది.

**తనకు తానే ప్రామిస్**

ప్రస్తుతం ఈ అమ్మడుకు సంబంధించిన వార్త ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. తనకు తానే కమిట్మెంట్ తీసుకొని ప్రామిస్ చేసుకొని హీరోయిన్ గా మారింది అనేది ఆ వార్త సారాంశం. ఇప్పుడు ఈ విషయం వైరల్ గా మారింది. అందరు అమ్మాయిల్లానే తనకు కూడా 25 ఏళ్లు రాగానే పెళ్లి చేసుకొని పిల్లల్ని కని జీవితంలో స్థిరపడాలని అనుకుందంట. భర్త, పిల్లలతో సరదాగా జీవితాన్ని ఆస్వాదించానుకుందంట.

**ఆర్థికంగా స్థిరపడాలని..**


అయితే కుటుంబం ఆర్థికంగా మంచి స్థాయికి చేరుకోవాలనే ఉద్దేశంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలి.. ఆ తర్వాతే పెళ్లి, పిల్లలు అని తనకు తానే ఒక ప్రామిస్ చేసుకుందంట. ఆ తర్వాత స్టార్ హీరోయిన్ గా మారింది. ఇప్పటికీ డబ్బులకు సంబంధించిన విషయంలో ఎంతో కఠినంగా ఉంటుంది. ఖర్చు చేసే విషయంలో ఆచితూచి చేస్తుంది. దుబారా ఖర్చులు చేయదు. అంతేకాదు.. విజయ్ దేవరకొండతో ఉన్న ప్రేమాయణాన్ని బయట పెట్టకుండా ఉండటానికి ఇది కూడా ఒక కారణమేమోనని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



# రణ్‌వీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ బ్రహ్మరాక్షస

'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో పేరు సంపాదించుకున్నాడు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ఆయనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు కూడా ఆసక్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రణ్‌వీర్‌సింగ్‌తో ప్రశాంత్‌వర్మ ఓ సినిమా చేయబోతున్నాడని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఈ ఏడాదే సెట్స్‌మీదకు వెళ్లనుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి 'బ్రహ్మరాక్షస' అనే టైటిల్‌ను ఖరారు చేశారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, అన్ని భాషల్లో అదే టైటిల్ ఉంటుందని అంటున్నారు. '
హనుమాన్' సినిమా తరహాలోనే సూపర్‌హీరో కథాంశంతో 'బ్రహ్మరాక్షస' తెరకెక్కనుందని, భారీ సాంకేతిక హంగులతో తీయబోతున్నారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ప్రస్తుతం ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్'పై దృష్టిపెట్టారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'బ్రహ్మరాక్షస' పట్టాలెక్కనుంది.

# పిరయాడిక్ డ్రామాలకు పెరుగుతున్న ఆదరణ




ఆ తరహా కథలతోముందుకు వస్తున్న హీరోలు కొత్తదనం పంచే క్రమంలో మన కథానాయకులు పిరయాడిక్ సినిమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గత కాలానికి తీసుకెళ్లి వినోదాలను అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడీ తరహా పీరియాడిక్ కథల జోరు తెలుగులో మరింత ఊపందుకుంది. పలువురు అగ్రతారలతో పాటు కుర్రహీరోలు ఈ కథలతోనే సినీ ప్రియుల్ని మురిపించేందుకు సమాయత్తమవుతున్నారు. ఈతరం ప్రేక్షకులు ఇలాంటి సినిమాలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తుండటంతో.. వారి అభిరుచుల్ని దృష్టిలో పెట్టుకునే ఆ తరహా కథలతో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.'బాహుబలి', 'ఆదిపురుష్' చిత్రాల కోసం చరిత్ర పుటలు తిరగేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన 'కల్కి 2898ఎ.డి' కోసం తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత ఆయన చేయనున్న సినిమాల్లో హను రాఘవపూడి చిత్రం ఒకటుంది. ఇప్పుడీ చిత్రం కోసం మరోసారి గతంలోకి ప్రయాణించనున్నారు ప్రభాస్. ఇది చారిత్రక అంశాలతో నిండిన ఫిక్షనల్ పీరియాడిక్ లవ్-యాక్షన్ డ్రామాగా ఉండనున్నట్లు హను ఇప్పటికే స్పష్టత ఇచ్చారు.

# ఓటిటిలోకి వస్తోన్న 'విద్య వాసుల అహం'

ఇప్పుడు మరో సినిమా ఇదే ఓటిటి ఆహా లో విడుదలకి సిద్ధం అయింది. ఈ సినిమా పేరు 'విద్య వాసుల అహం' ఇందులో కొంచెం మసాలా కూడా వున్నట్టుగా ఈ సినిమా టీజర్ చూస్తే అర్థం అవుతోంది. అహంతో కూడిన ప్రేమకథ లోని భావోద్వేగాలను, ఇగోలను చూపించడానికి రెడీ అవుతున్నారు విద్య, వాసు. ఈ సినిమా మే 17న ప్రపంచవ్యాప్తంగా ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ వేదికగా ప్రీమియర్ కానుంది. ఈ సినిమా కథని కథని టూకీగా చెప్పాలంటే రాహుల్ విజయ్, శివానిలు అసలు పెళ్ళంటే ఇష్టం లేని వాసు, విద్యలుగా ఇందులో కనిపిస్తారు, కానీ ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోవలిసి వస్తుంది. పెళ్లయిన తరువాత ఇద్దరూ ఒకరి అభిప్రాయాలకి, ఇంకొ కరు గౌరవించాలి, మాట్లాడు కోవాలి, కానీ కాని ఇద్దరూ నేనే నెగ్గాలి అని అనుకుంటే,
అదే ఇగోకి పోతే, ఆ పెళ్లి జీవితంలో ప్రేమ బాధ్యతల మధ్యలో ఇగో వస్తే ఎలా ఉంటుంది అనే నేపథ్యంలో కథ జరుగుతుంది. అలాంటి సమయంలో వీరిద్దరూ ఇగోతో కలిసే ఉంటారా లేదా పెళ్ళైన కొత్తలో ఉండే మూమెంట్స్ ని ఎంజాయ్ చేస్తారా అనేది తెలియాలంటే ఆహాలో మే 17 వరల్డ్ డిజిటల్ ప్రీమియర్ అయ్యే వరకు వేచి చూడాల్సిందే...ఈ సినిమాకి మహేష్ దత్త మొతూరు, లక్ష్మీ నవ్య మక్కపాటి నిర్మాతలు. మణికాంత్ గెల్లి దర్శకుడు. 'విద్య వాసుల అహం' (ఏ లాంగ్ లాంగ్ ఈగో స్టోరి) అనే టాగ్ లైన్ లో వస్తున్నా ఈ సినిమా ఆహాలో ఈ నెల 17న విడుదలవుతోంది అని చిత్ర యూనిట్ వెల్లడించింది.





# డిస్నీలో రానున్న యక్షిణి వెబ్ సీరిస్




ఇప్పటికే డిఫరెంట్ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ లతో ఓటీటీ అభిమానులకు ఫేవరేట్ గా మారింది డిస్నీ ప్లస్ హాట్ స్టార్. ఈ డిజిటల్ ప్లాట్ ఫామ్ త్వరలో యక్షిణిఅనే మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది. ఈ వెబ్ సిరీస్ ను బాహుబలి ప్రొడక్షన్ హౌస్ 'ఆర్కా మీడియా వర్క్స్' పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. ఈ సిరీస్‌తోవేదిక, మంచు లక్ష్మి , రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అర్జున ఫాల్గుణ, జోహార్, కోట బొమ్మాళి పీఎస్ వంటి సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ మార్ని యక్షిణి సిరీస్ ను రూపొందిస్తున్నారు. రీసెంట్ గా 'యక్షిణి' కమింగ్ సూన్ అంటూ ఈ వెబ్ సిరీస్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఇప్పటి దాకా వచ్చిన సోషియో ఫాంటసీ సినిమాలు, వెబ్ సిరీస్ లకు భిన్నమైన కాన్సెప్ట్ తో 'యక్షిణి'ని రూపొందించారు. ఈ సిరీస్ కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. తెలుగు తో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో 'యక్షిణి వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది.

# డేట్లు ఖాళీ లేవంటున్న రష్మిక



కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. '